ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 9 జనవరి 2024

సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఎమ్మెల్యే విజయరమణారావు
8లో..

రామగుండంలో అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు
- కలెక్టర్
8లో..



సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి క్వారీ స్టాక్ పాయింట్ వద్ద లారీలో ఇసుక లోడింగ్

ముగిసిన ఇసుక తవ్వకాల గడువు

- ఇప్పటివరకు 56.77 లక్షల క్యూబిక్ మీటర్ల తరలింపు
- స్టాకు యార్డుల్లో 5 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు నిల్వలు
- క్వారీలను పర్మనెంట్‌గా మూసివేయాలంటున్న ప్రజలు
- రిజర్వులో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ తీర్పు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మానేరు నది నుంచి ఇసుక తవ్వకాలపై డీఎల్‌సీ ఇచ్చిన గడువు ముగిసింది. అయితే తవ్వకాలను కొనసాగిస్తారా, నిలిపివేస్తారా.. అనే అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇసుక తవ్వకాల వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము, ధూళితో అనారోగ్యం పాలవుతున్నారని ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని మానేరు పరిరక్షణ సమితి అధ్యక్షుడు అంబటి కరుణాకర్‌రెడ్డి నేషనల్ ట్రిబ్యూనల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణలు పూర్తి కాగా, తీర్పు రిజర్వులో ఉన్నట్లు సమాచారం. మానేరు నదిపై సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గట్టెపల్లి, కదంబాపూర్, తొగర్రాయి, ఓదెల మండలం మడక, గుండ్లపల్లి, కనగర్తి, పొత్కపల్లి, రూప్‌నారాయణపేట, ఇందుర్తి, గుంపుల, కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్, మొట్లపల్లి, ముత్తారం మండలం ఓడేడు, అడవి శ్రీరాంపూర్, మంథని మండలం గోపాల్‌పూర్, చిన్న ఓదాల వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యామ్‌ల్లో 1,32,60,000 క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడి తరలించేందుకు 25 రీచుల కోసం 2022 జనవరి11వ తేదీన టీఎస్ఎండీసీ ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించింది. చెక్‌డ్యామ్ లోపల పెద్ద ఎత్తున ఇసుక పేరుకు పోయిందని, దీని వల్ల నీటినిల్వ సామర్థ్యం పెరగదని, రెండు మీటర్ల లోతు వరకు ఇసుక తొలగించాలని సంబంధిత అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ మేరకు టీఎస్ఎండీసీ ద్వారా ఇసుకను తరలించేందుకు టెండర్లు జారీ చేసింది. ఇసుక రీచుల్లో ఇసుకను తోడి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుల వరకు తీసుకవచ్చి అక్కడ లోడింగ్ చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. పలువురు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ఇసుక రీచులను దక్కించుకున్నారు.

● పొడిగిస్తారా, నిలిపివేస్తారా..?

మానేరు నుంచి ఇసుకను తవ్వి స్టాక్‌యార్డుల్లో పోసిన తర్వాత అక్కడి నుంచి టీఎస్ఎండీసీ బుకింగ్ చేసుకున్న వారికి క్యూబిక్ మీటర్‌కు 650 రూపాయల చొప్పున విక్రయించింది. 25 ఇసుక రీచులను కాంట్రాక్టర్లు దక్కించుకున్నప్పటికీ అడవిశ్రీరాంపూర్ 1, అడవిశ్రీరాంపూర్ 2, కనగర్తి1, కనగర్తి 2, పొత్కపల్లి 1, పొత్కపల్లి 2, గుండ్లపల్లి 1, గుండ్లపల్లి 2, కిష్టంపేట్, గోపాల్‌పూర్, మడక 1, మడక 2, ముత్తారం, ఓడేడు 1, గుంపుల, ఇందుర్తి, కిష్టంపేట్ 2, తొగర్రాయి, నీరుకుల్ల, గొల్లపల్లి క్వారీల నుంచి 56 లక్షల 77 లక్షల 418 క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారు. స్టాక్ యార్డుల్లో ఇంకా 5లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక ఉంది. ఇందుర్తి, నీరుకుల్ల, గొల్లపల్లి, కనగర్తి 2 క్వారీలు మినహా మిగతా క్వారీల నుంచి లక్ష నుంచి 4లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుకను తరలించారు. ఇసుక తవ్వకాలకు సంబంధించి జిల్లాస్థాయి స్యాండ్ కమిటీ గడిచిన డిసెంబర్ నెలాఖరు వరకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. ఇసుక తవ్వకాల వల్ల ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పెద్ద భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మానేరుపై చేపట్టిన చెక్ డ్యామ్‌లు చాలావరకు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల చెక్ డ్యామ్‌లు పూర్తికాలేదు. పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే ఇసుక తవ్వకాలను చేపడతున్నారని, వాటిని నిలిపి వేయాలని మానేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబటి కరుణాకర్‌రెడ్డి, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి నేషనల్ ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో గత ఏడాది జనవరిలో తాత్కాలికంగా ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కారణంగా, వర్షాల కారణంగా కొద్ది రోజుల పాటు ఇసుక తవ్వకాలు ఆగాయి. కొందరు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించి స్టే తీసుక వచ్చి కొన్ని క్వారీలను నడిపించారు. డిసెంబర్ నెలాఖరు వరకు ఇసుకను తోడి డంపింగ్ యార్డుల్లో పోశారు. మొదట నిర్ధేశించిన ప్రకారం ఇసుక తవ్వకాలు జరగనందున కాంట్రాక్టు గడువును పొడిగిస్తారా, నిలిపి వేస్తారా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమ రవాణా కాస్త ఆగిపోయింది. ఇదే మానేరు నుంచి అధికారికంగా 56 లక్షల 77 లక్షల 418 క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించినప్పటికీ, అనధికారికంగా, ఎక్ట్రా బకెట్ల పేరిట 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను కాంట్రాక్టర్లు అక్రమంగా తరలి ఉంటుందనే ప్రచారంలో ఉంది. ప్రస్తుతం కొన్ని డంపింగ్ యార్డుల వద్ద ఉన్న ఇసుకలో కొంత ఇసుకను రాత్రివేళలో అక్రమంగా తరలించాలని చూస్తు న్నారని సమాచారం. దీనిపై టీఎస్ఎండీసీ అధికారులు నిఘా పెంచాల ని, ఇసుక రీచులను మొత్తానికే నిలిపి వేయాలని వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఓదెల మండలం గుండ్లపల్లి క్వారీ వద్ద స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వలు

నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని, రేషన్ బియ్యం రీసైక్లింగ్ గాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గత ఏడాది వానాకాలం, యాసంగికి సంబంధించిన సీఎంఆర్ రైస్ పెండింగులో ఉండ డానికి గల కారణాల గురించి తెలుసుకున్న ఆయన ఎట్టి పరిస్థితుల్లో ఈనెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని, లేనట్లయితే ఆయా రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలును త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిరోజు నిర్దేశిత లక్ష్యం మేరకు భారత ఆహార సంస్థకు సీఎంఆర్ రైస్ సరఫరా చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, గడువులోగా పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ పూర్తిచేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, డీఎస్‌వో ఏ.ప్రేమ్ కుమార్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

అంతర్గాం, జనవరి 8: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం కలెక్టర్ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ ఏరియా మల్యాలపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుని శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరై కష్టసాధ్యమైన సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులను ఒకటికి రెండుసార్లు అడిగితెలుసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కనుకయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు

- ప్రజా వాణిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కోల్‌సిటీ, జనవరి 8: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకునే పద్ధతిని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు మార్చుకోవాలని, వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు ప్రజావాణి కార్యక్రమం కోసం ప్రత్యేక రిజిష్టర్ నిర్వహించాలని, దరఖాస్తుల వివరాలు సదరు రిజిష్టర్‌లో నమోదు చేయాలని, పరిష్కారం అయ్యేవిధంగా విధులు నిర్వహించాలన్నారు. అదే సమస్యపై రెండవ సారి దరఖాస్తు వచ్చే విధంగా ఉండవద్దన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల పట్ల అధికారులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. మంథని మండలం బిట్టుపల్లికి చెందిన బండారి అశోక్ సర్వే నంబరు372లోని తన రెండు ఎకరాల భూమిని సింగరేణి సేకరించి పరిహారం ఇవ్వడం లేదని దరఖాస్తు చేసుకోగా మంథని ఆర్‌డీవోకు చర్యలకు సిఫార్సు చేశారు. ఎన్‌టీపీసీ నుంచి మేడిపల్లి రోడ్డులో డివైడర్లలో కోనోకార్పస్ చెట్లు ఉండడం వల్ల గాలి నాణ్యత, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, తగు చర్యలు తీసుకోవాలంటూ ప్రసాద్, రమేష్‌లు కోరగా కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. లక్ష్మీనగర్‌కు చెందిన శంకర్ అనే వికలాంగుడు తనకు సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. తనకు కంటి చూపునే సమస్యగా చూపుతున్నారని, కాలు తొలగించినా కూడా వికలాంగుడిగా గుర్తించడం లేదన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలంటూ డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. 12వ డివిజన్ విఠల్‌నగర్‌కు చెందిన రియాజుద్దీన్ రోడ్లు, వీధి దీపాలు, పందుల నివారణపై కలెక్టర్‌కు నివేదించారు. అలాగే బేగంపేటలోని హజరత్ పీర్ పహాడి దర్గాకు దారిని, అటవీశాఖకు చెందిన భూమిని రైతులు కబ్జా చేశారని, దీంతో దర్గాకు వెళ్లే దారిలేకుండా పోయిందని, దర్గాకు దారి ఇప్పించాలని కోరారు. అలాగే 5వ డివిజన్‌కు చెందిన రహీం5వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని, మల్కాపూర్ రహదారిని నిర్మించాలని కోరారు. మద్దెల దినేష్ అనే వ్యక్తి కరకట్ట నిర్మాణం, విఠల్‌నగర్ మార్కెట్ నిర్వహణ పనుల గురించి అధికారులను కోరారు. ఎన్‌టీపీసీ ఎస్‌బీఐ నుంచి మేడిపల్లి సెంటర్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని కార్పొరేటర్ కొలిపాక సుజాత కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నాగేశ్వర్, తహసిల్దార్ కుమారస్వామి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్



దరఖాస్తు తీసుకుంటున్న అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన బోయిని స్వరూప తనకు శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామంలో ఉన్న రేషన్ కార్డును పెద్దపల్లి పట్టణంలోని 3610019 నంబర్‌గల రేషన్ షాపునకు బదిలీ చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా జిల్లా పౌర సరఫరాల అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన జక్కుల సంతోష్ తాను దివ్యాంగుడినని, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం మధ్యలో ఆపేశానని, కంప్యూటర్ పరిజ్ఞానం ఉందని, ప్రభుత్వ శాఖలో ఏదైనా ఉద్యోగం ఇప్పించగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వారధికి రాస్తూ అవకాశం మేరకు పరిశీలించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణం రంగంపల్లికి చెందిన నిజముద్దిన్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, విద్యుత్ శాఖ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

సూల్ పాయింట్ల వద్దకు బియ్యం సరఫరా చేయాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 8 : స్కూల్ పాయింట్ల వద్దకు నేరుగా మధ్యాహ్న భోజన బియ్యం సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి పాఠశాలలకు బియ్యం సరఫరాపై సంబంధిత అధికారులు, స్టేజి 2 రవాణా కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి స్టేజ్ 2 రవాణా కాంట్రాక్టుల ద్వారా సరఫరా అయ్యే మధ్యాహ్న భోజన బియ్యం నేరుగా స్కూల్ పాయింట్ల వద్దకే రవాణాచేయాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రవాణా చేసే సమయంలో బియ్యం నాణ్యత ప్రమాణాలు తూకం సరిచూసుకోవాలని, అదేవిధంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు బియ్యం దిగుమతి చేసుకునే ముందు బియ్యం నాణ్యత తూకం సరిచూసుకోవాలని తెలిపారు. బియ్యం తూకం నాణ్యత విషయంలో ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈవో మాధవి, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలు, స్టేజ్ 2 రవాణా కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి



రిలే దీక్షలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు రామారావు

అంతర్గాం, జనవరి 8: రైల్వేసంస్థలో కార్మికులకు నష్టదాయకమైన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని (ఎస్‌సీఆర్ఎంయూ) సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ రామగుండం బ్రాంచ్ చైర్మన్ ఎం రామారావు, ఎస్‌సీఆర్ఈఎస్ ఎంప్లాయిస్ సంఘ్ నాయకుడు అజ్మీరా వీరన్న అన్నారు. సోమవారం ఏఐఆర్ఎఫ్, ఎన్ఎఫ్ఐఆర్ నాయకత్వం ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఎస్‌సీఆర్ఎంయూ, ఎస్‌సీఆర్ఈఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టి ఈ మేరకు మాట్లాడారు. ఈనెల 8 నుంచి 11వరకు పాత పెన్షన్ విధానం సాధన కోసం దీక్షలు కొనసాగించనున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారు వర్గాలకు కొమ్ము కాస్తూ కార్మికవర్గానికి నష్టం చేసే చర్యలకు పూనుకున్నదని ఆరోపించారు. కాగా స్థానిక 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ రిలే దీక్షలను సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. నాయకులు ఓవై స్వామి, వీరన్న, మోజెస్, ఆనంద్, అనిల్, శ్రీధర్, విజయ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 8 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు జనవరి 20 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి ఎం. మంజుల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాలల్లో 5వ తరగతిలో గురుకుల ప్రవేశాల కోసం 2023-24లో సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు జనవరి 20 వరకు ఆన్‌లైన్‌లో 100 రూపాయలు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న జరుగుతుందని, ఇతర వివరాలకు ttps://tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి ఎం. మంజుల ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కస్తూర్బా విద్యార్థినికి న్యాయం చేయాలని ఆందోళన

సుల్తానాబాద్, జనవరి 8:మండలంలోని భూపతిపూర్‌లోని కస్తూర్బా స్కూల్ విద్యార్థిని అమూల్యకు న్యాయం చేయాలని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మా రవేణి రంజిత్ డిమాండ్ చేశారు. సోమావరం భూపతిపూర్ స్కూల్ వద్ద కార్య కర్తలతో కలిసి ధర్నా చేశారు. ఈనెల 6న ఏడో తరగతి విద్యార్థిని అమూల్య పాముకాటుకు గురైందని, మూడు రోజులైనా ఎలాంటి చర్యలు లేవన్నారు.

పాము కాటు కాదు : స్పెషల్ అఫీసర్ స్వప్న

భూపతిపూర్ స్కూల్‌లో అమూల్య పాటుకాటుకు గురైనట్టు నిర్ధారణ కాలేద ని, డాక్టర్లు కూడా చెప్పలేదని స్పెషల్ అఫీసర్ స్వప్న అన్నారు. ఈనెల 6న ఉద యం అమూల్య అనే విద్యార్థినికి ఏదో పురుగు కుట్టినట్టు చెప్పగా తాము వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. అక్కడి డాక్టర్లు కూడా అది పాముకాటు అని నిర్ధారించలేదని, అమూల్యను ఆమె కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుపోయారన్నారు. ప్రస్తుతం ఆమె డిశ్చార్జి అయిందని, కావాలనే ఈ విషయాన్ని వివాదాస్పదం చేస్తున్నారని ఆమె తెలిపారు.

'ఉన్నతి కార్యక్రమాన్ని రద్దు చేయాలి'

పెద్దపల్లి కల్చరల్, జనవరి 8 : ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న (ఫౌండేషన్ ఇన్ లిటరసీ అండ్ నుమరసి) ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమలను రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ డిమాండ్ చేశారు. చాలావరకు ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని, ఎఫ్ఎల్ ఎన్ విధానంలో ఒక సబ్జెక్టుకు బోధనా చేయాలంటే కనీసం 90 నిమిషాల సమయం పడుతుందని దీని వలన ఒకరోజు మూడు లేదా నాలుగు సబ్జెక్టుల బోధన మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఎఫ్ఎల్ఎన్ విధానంలో బోధన చేయడం వలన ఏ తరగతికి కూడా న్యాయం చేయలేకపోతున్నారన్నారు. కాబట్టి సదరు కార్యక్రమాలను వెంటనే రద్దు చేసి, క్షేత్రస్థాయిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల అభిప్రాయలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మండల సమావేశాలకు అధికారులు హాజరుకావాలి

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 8: ప్రజాప్రతినిధులు, అధికారులు మండల సమావేశాలకు హాజరైతేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండల సర్వ సభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు హాజరుకాకపోతే సమస్యల పరిష్కారం సాధ్యంకాదని, ఇలా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరం సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని, ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటి విడుదల షెడ్యూల్‌ను ముందుగానే ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని పలువురు సర్పంచ్‌లు ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మండలంలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆస క్తి కలిగి ఉన్న రైతులు ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా గ్రామాల్లో తాము చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని సర్పంచులు ఎమ్మెల్యేకు ఒక వినతిప్రతం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాశ్‌రావు, ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డి తదితర మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

● కాట్నపల్లిలో జీపీ భవనం ప్రారంభోత్సవం

మండలంలోని కాట్నపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం నిదులు ఇరవై లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొలం వద్ద విద్యుత్ తీగ అమర్చిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, జనవరి 8: పొలం వద్ద విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన బెంద్రపు నరసింహారెడ్డి వర్షిణి దంపతులు గత డిసెంబరు 25న వరినాట్లు వేశారు. వరి సరిపోక పోవడంతో అదే గ్రామానికి చెందిన రైతు తిప్పని రాజయ్యను వరి నారు అడిగారు. సదరు రైతు ఇస్తానని చెప్పడంతో నరసింహారెడ్డి వర్షిణి దంపతులు ఇద్దరూ వరి నారు కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్లారు. అక్కడ పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు నరసింహారెడ్డికి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాలుకు గాయం కాగా అక్కడే ఉన్న వర్షిణి పక్క పొలంలో ఉన్న మరో రైతు దేవయ్య వద్దకు పరిగెత్తి జరిగిన విషయం చెప్పింది. వెంటనే దేవయ్య ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై నరసింహారెడ్డి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్ ఉన్నారు.

నివాసాల మధ్య వైన్స్ వద్దు

● వ్యాపారి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంగల్‌దాస్ అశోక్

సుభాష్‌నగర్, జనవరి 8: నివాసాలు, వస్త్ర దుకాణాల మధ్యలో వైన్స్ ఏర్పాటు చేయవద్దని కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో వెంగల్‌దాస్ అశోక్ అనే వ్యాపారి సోమవారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్‌లోని గాంధీరోడ్డులో వైన్స్‌ను ఏర్పాటు చేయవద్దని వస్త్ర వ్యాపారులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా గాంధీరోడ్డులో వస్త్ర వ్యాపారం చేస్తున్నామని, వాటి మధ్య వైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో తాము అక్కడ వ్యాపారాలు నిర్వహించలేమని, మహిళా కస్టమర్లు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దుకాణాల మధ్య వైన్స్ ఏర్పాటు చేయవద్దని గతంలోనూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దానికి స్పందించిన కలెక్టర్ సబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైన్స్ నిర్వాహకులు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి తెచ్చుకుని, షాపు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. దీనిని అడ్డుకోవడంతో వైన్స్‌కు సంబంధించిన వ్యక్తులు తమపై దాడులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి జైలు శిక్ష



మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం, జనవరి 8: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ సోమవారం తీర్పు చెప్పారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి ఒక రోజు జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, 23 మందికి రూ.3 వేల జరిమానా విధించారు. అనంతరం సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజు, ట్రాఫిక్ కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని



విద్యార్థినికి ట్రోఫీ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

చొప్పదండి, జనవరి 8: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఈ నెల 10న రాజస్థాన్‌లోని బికనూర్ పట్టణంలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు 9వ తరగతి విద్యార్థిని బుర్ర వైష్ణవి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు. గత నెల 23 నుంచి 25 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచింది. బుర్ర వైష్ణవి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డిని పలువురు అభినందించారు.

రైస్ మిల్లు నిర్వాహకుడి అరెస్టు

శంకరపట్నం, జనవరి 8: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ శివారులో గల పవనసుత ట్రేడర్స్ రైస్ మిల్లు నిర్వాహకుడు ఏనుగుల అనిల్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ శివారులోని లలిత ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును పవనసుత ట్రేడర్స్ పేరుతో గత కొంత కాలంగా లీజ్‌కు నిర్వహిస్తున్నాడు. ఈ మిల్లుపై సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. గత సీజన్‌లో ప్రభుత్వం 38,893 క్వింటాళ్ల ధాన్యం మిల్లర్‌కు అందజేసింది. అయితే అనిల్ కేవలం 2,893 క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్ ఇవ్వగా, మిగతా 23,504 క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు 55ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిర్వాహకుడికి పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. గత అక్టోబరులో పంచనామా నిర్వహించి నోటీసులు ఇచ్చారు. అసలు, వడ్డీ, అదనపు వడ్డీతో కలిపి మొత్తం రూ. 7,18,26,515 జరిమానా విధించి, చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా మిల్లు నిర్వాహకుడు స్పందించకపోవడంతో ఈ నెల 5న సివిల్ సప్లయీ డీఎం రజనీకాంత్ ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

భూకబ్జాను అడ్డుకున్న రైతులు

జగిత్యాలరూరల్, జనవరి 8: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ - చల్‌గల్ గ్రామాల మధ్యలో గల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి వెళ్లే రహదారి భూమిని కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులను హస్నాబాద్ , చల్‌గల్ గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పురాతన కాలంనుంచి వెంకటేశ్వర ఆలయ రహదారికి కోసం రైతుల వద్ద నుంచి కొంత భూమిని సేకరించి రహదారి ఏర్పాటు చేసుకున్నామని చల్‌గల్, హస్నాబాద్ రైతులు పేర్కొన్నారు. దీనిని కొంతమంది వ్యక్తులు రహదారిని చెరిపివేసి భూకబ్జాకు పాల్పడుతున్నారని హస్నాబాద్ రైతులు ఆరోపించారు.

ఆలయానికి పురాతనకాలం నుంచి ఉన్న రహదారిని యధావిధిగా కొనసాగించాలని, అలాగే భూకబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో హస్నాబాద్ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సత్యక్కపల్లెలో చిరుతపులుల కలకలం

● భయందోళనలో గ్రామస్థులు


చిరుత పులివిగా అనుమానిస్తున్న గుర్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 8: మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కనిపించిన చిరుతపులి పాదం గుర్తులు సోమవారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ సమీపంలో ఉన్న నీలి చిన్నారెడ్డి అనే రైతు వ్యవసాయ తోటలో చిరుత పులి పాదం గుర్తులుగా భావించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామంలోని కొందరికి ఇటీవల రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతం నుంచి చిరుత తన పిల్లలతో సంచరిస్తూ ఉదయం సమయంలో కనిపించినట్లు, అవి పులులుగా తెలయక ఎవరికి చెప్పలేదని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌వో మహ్మద్ హఫీజ్‌ద్దిన్, బీట్ అధికారి శిరాజ్ సంఘటనస్థలాన్ని పరిశీలించారు. ఈ గుర్తులు హైన పాదం అడుగులాగా ఉన్నాయని, చిరుత పులులు కాదని పేర్కొన్నారు. ఏ జంతువు అనేది గుర్తించేందుకు అటవీ పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు మహ్మద్ హఫిజోద్దిన్ తెలిపారు.

సౌదీ అరేబియాలో చందుర్తి వాసి మృతి


నాగయ్య (ఫైల్)

చందుర్తి, జనవరి 8: చందుర్తికి చెందిన కైర నాగయ్య 55 అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందాడు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాల నుంచి గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా వెళ్లిన నాగయ్యకు నాలుగు రోజుల క్రితం పక్షవాతం రావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గంగవ్వ 20 సంవత్సరాల క్రితమే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన వేములవాడ క్షేత్రం


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 8: దక్షిణాకాశీగా వీరాజిల్లుతున్న రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో భక్తులు, హన్మకొండ, వరంగల్, కరీంనగర్, హుజురాబాద్, హైదరాబాద్, కొరుట్లయ మెట్‌పెల్లి, నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు ఆదివారం తరలి వచ్చారు. సోమవారం తెల్లవారు జామున భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించడంతో పాటు ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగిపోయింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి వేచివుండి ఆలయంలోకి ప్రవేశించి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. కోడెటికేట్ క్యూలైన్‌లో వెళ్లిన భక్తులు శ్రీ స్వామి వారి దర్శనం కోసం నాలుగు గంటలు పట్టినట్లు భక్తులు వాపోయారు. రాజన్నకు కోడెను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈవోలు, సూపరిండెంట్ అల్లి శంకర్, అశోక్, సిరిగిరి శ్రీరాములు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

హుజూరాబాద్‌లో సైబర్ మోసం

హుజూరాబాద్, జనవరి 8: హుజూరాబాద్‌లో సైబర్ మోసం జరిగింది. మున్సిపాలిటీలో పనిచేసే వేల్పుల బాబుకు సోమవారం సెల్‌ఫోన్‌కు ఓ లింక్ రావడంతో ఓపెన్ చేశాడు. దీంతో అతని అకౌంట్‌లోని రూ. 18వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మేసేజ్ వచ్చింది. దీంతో హుటాహుటిన బాబు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 8: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల టగ్‌ఆఫ్‌వార్, టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను ఉదయం 9 గంటల నుంచి మానకొండూర్ మండలం జడ్పీహెచ్‌ఎస్ చెంజర్ల పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచితాలు వద్దంటూ ఢిల్లీకి సైకిల్ యాత్ర


కరీంనగర్ నుంచి సైకిల్‌పై ఢిల్లీకి బయల్దేరిన బెల్లపు కరుణాకర్

కరీంనగర్ అర్బన్, జనవరి 8: ఉచితాలు వద్దు.. అంటూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన బెల్లపు కరుణాకర్ అనే యువకుడు సైకిల్‌పై ఢిల్లీకి యాత్ర చేపట్టాడు. సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి హైదరాబాద్ ధర్నా చౌక్ మీదుగా దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్ వరకు సైకిల్‌పై బయల్దేరాడు. 'అనవసరపు ఉచితాలు వద్దు, ప్రామాణిక ప్రభుత్వ విద్య, వైద్యమే ముద్దు' అంటూ సైకిల్‌కు ఒక బోర్డు ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వాలు చేపడుతున్న ఉచిత పథకాలతో సమాజం చిన్నాభిన్నం అవుతుందని నిరసన వ్యక్తం చేస్తూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు కరుణాకర్ తెలిపారు. సైకిల్‌యాత్రలో దారి పొడుగునా ఉచితాలపై నిరసన వ్యక్తం చేస్తూ తన గళాన్ని వినిపించనున్నట్లు ఆయన తెలిపారు. కరుణాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నియోజకవర్గం మొత్తం సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం నిర్వహించాడు.

డిగ్రీ పరీక్షల్లో 14 మంది డీబార్

గణేశ్‌నగర్,జనవరి 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 14 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.

ఒకటో సెమిస్టర్‌లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-4, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కరీంన గర్‌లో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, మూడో సెమిస్టర్‌లో శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో 1, అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో-4, ప్రభుత్వం ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ జగిత్యాలలో-2, ప్రభుత్వం డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్‌కు యువకుడి బలి

పెద్దపల్లి రూరల్ , జనవరి 8: ర్యాష్ డ్రైవింగ్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెద్దపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన హారిక పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పరీక్షలు రాసి తన సోదరుడు రాజేష్ (18)తో సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా అప్పన్నపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ హారిక, రాజేష్‌ల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో హారికతో పాటు ఆమె సోదరుడు రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రాజేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించగా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్ సోమవారం మృతిచెందాడు. హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

అధిక రక్తస్రావంతో బాలింత మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతోనే అని బంధువుల ఆందోళన


మృతి చెందిన చెకుట పద్మ


రోధిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

వేములవాడ టౌన్, జనవరి 8: డెలివరీ కోసం ఆసుపత్రిలో చేరిన గర్భిణీకి పాప జన్మించిన కాసేపటికే అధిక రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా మృతి చెందిన సంఘన వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి జీవధార ఆసుపత్రిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన చేకుట పద్మ (30) అనే గర్భిణీ పురిటి నొప్పులతో ఆదివారం నాంపల్లి జీవధార ఆసుపత్రిలో చేరింది. దీంతో పద్మకు సోమవారం ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాసేపటికే పద్మకు ఓవర్ బ్లీడింగ్ అవుతోందని కరీంనగర్ తరలించాలని వైద్యులు చెప్పడంతో అక్కడికి తరలిస్తుండగానే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ కరుణాకర్‌తో పాటు రూరల్ సీఐలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న మృతురాలి బంధువులకు, ఆసుపత్రి యాజమాన్యానికి నచ్చజెప్పి ప్రయత్నం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. మృతదేహాన్ని అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయంపై వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సంఘటనపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోధనలు

పద్మకు పెళ్లి అయినప్పటి నుంచి పిల్లలు కాలేదని, పది సంవత్సరాల తరువాత గర్భం దాల్చితే ఆడబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిందని కుటుంబ సభ్యులు రోధించిన తీరు అక్కడున్న వారిని కంటతడిపెట్టించాయి. ఎంతో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని బంధులు రోదించడంతో ఆసుపత్రి ప్రాంగణంలో విశాదం అములుకున్నది.

నివాస గృహానికి రూ.33వేల కరెంటు బిల్లు

గంభీరావుపేట, జనవరి 8: గంభీరావుపేట మండల కేంద్రంలో నెలసరి కరెంటు బిల్లులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. నెల నెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే వినియోగదారులకు సైతం వేలల్లో బిల్లులు రావడంతో బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రంలో వరలక్ష్మి అనే మహిళ పేరున ఉన్న విద్యుత్ మీటర్‌పై 33 వేలకు పైగా బిల్లు రావడం చర్చనీయాంశమైంది. అదే విదంగా అనిత పేరు మీద ఉన్న మీటర్‌పై 2 వేలకు పైగా నెలసరి బిల్లు రావడం, ఇలా మామూలు గృహాలకు సైతం వేలల్లో బిల్లులు వస్తున్నాయి.

కంప్యూటర్ల చోరీపై కొనసాగుతున్న విచారణ

● రంగంలోకి క్లూస్ టీం
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ


ఎస్ఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు

తిమ్మాపూర్, జనవరి8: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ శాఖ, ఇరిగేషన్ సర్కిల్-2, డివిజన్ నెం-5 కార్యలయంలో ఆదివారం దొంగతనం జరిగి 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్లిన సంగతి విదితమే. అయితే డివిజన్-5 కార్యాలయంతో పాటుపక్కనే ఉన్న ఇరిగేషన్ శాఖ సర్కిల్-1 కార్యలయంలో కూడా దొంగతనం చేసేందుకు కార్యాలయానికి వేసిన తాళాలను పగల గొట్టినట్లు సోమవారం కార్యలయానికి వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

చోరీపై అనుమానాలు

ఇరిగేషన్ శాఖ డివిజన్ నెంబరు-5 కార్యలయంలో కంప్యూటర్లు చోరీకి గురి కావడంతో ముఖ్యమైన మానేరు రివర్ ఫ్రంట్, దిగువ మానేరు జలాశయం, ట్యాంకుల ముఖ్యమైన పనుల బిల్లులు, రికార్డులు ఈ కార్యలయంలోనే జరుగుతుండటంతో ఆ డాటా కోసం ఏమైనా దొంగిలించారా, లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతానానికి పాల్పడ్డారా అని పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సోమవారం ఉదయం కార్యాలయానికి ఉద్యోగులు వచ్చే సమయానికి క్లూస్ టీం ఇన్‌ఛార్జి శ్రీధర్, తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు కలిసి కంప్యూటర్లు దొంగతనం జరిగిన కార్యాలయానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. తనిఖీ చేసి అనవాళ్లు, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. ఎస్‌బి సిఐ సృజన్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ సిఐ నరేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి వివరాలు సేకరించి, విచారించారు. దొంగతనం జరిగిన కార్యలయంలో ఉన్న ప్రతి ఉద్యోగికి సంబంధిచిన వివరాలు సేకరించారు. ఉద్యోగులను ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. కార్యాలయ ఉద్యోగులందరినీ ఒక్కొక్కరిగా విచారించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

చోరీ జరిగిన కార్యాలయాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు పరిశీలించారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన సమాచారం ఉందనే దానిపై ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్‌తో పాటు ఇతర అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన డాటా లేదని, ఇతర కార్యాలయల్లో కూడా డాటా అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు సమాచారం ఇచ్చారు. డివిజన్-5 కార్యలయ అధికారులు కూడా కేవలం 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రింటర్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు, డాక్యుమెంట్లు, ఫైల్స్ దొంగతనానికి గురికాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో కార్యాలయంలో చోరీకి యత్నం

ఇరిగేషన్ సర్కిల్-1 కార్యాలయం తాళాలు పగల గొట్టేందుకు ప్రయత్నించిన ఆనవాళ్లు కనబడటంతో కార్యలయ ఉద్యోగులను లోనికి వెళ్లనివ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

జూలపల్లి, జనవరి 8 : ప్రజల సంక్షేమాభివృద్ధికి తమ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని కల్యాణలక్ష్మి చెక్కులను మండలంలో గల ఆయా గ్రామాల లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం అదే కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన విధంగా మేలైన పరిపాలనను అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందుకు కొంతసమయం పడుతుందన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల వంట బిల్లులు రాక అవస్థలు పడుతున్నారని, వారిని ప్రభుత్వం పట్టించుకునేలా చూడాలని, అలాగే ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారికి బిల్లులు అందించి ఆదుకోవాలని జూలపల్లి సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్ ఎమ్మెల్యేను కోరారు. తెలుకుంట సర్పంచ్ సొల్లు పద్మ, కాచాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు మారుపాక శ్రీలత గ్రామాల్లో నెలకొన్న ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. అంతకుముందు సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు సభకు పరిచయం చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, తహసీల్దార్ బషిరుద్దిన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, విండోచైర్మెన్ పుల్లూరి వేనుగోపాల్‌రావు, ఎంఈవో కవిత, ఏవో ప్రత్యూష, ఏఈలు అశోక్, సువిశాల, డాక్టర్లు సంపత్‌రెడ్డి, అజారొద్దిన్, ఏపీఎం సుదాకర్, వైస్ఎంపీపీ రమేష్, సర్పంచులు బంటు ఎల్లయ్య, మేచినేని సంతోష్‌రావు, కుంటూరి రాజయ్య, మల్లేశం, ఎంపీటీసీలు తమ్మడవేని మల్లేశం, శ్రీనివాస్, అమరగాని మమత, ఉపసర్పంచ్ కొప్పుల మహేస్, నాయకులు కంకణాల జ్యోతిబసు, సొల్లు శ్యాం, కొత్త రవిందర్, అమరగాని ప్రదీప్‌కుమార్, మారపాక కుమార్ పలువురు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్రాల కరాటే పోటీలో షిటోరియో విద్యార్థుల ప్రతిభ

మంథని, జనవరి 8: పరకాలలో నిర్వహించిన అంతరాష్ట్రాల కరాటే పోటీలో మంథని జపాన్ షిటోరియో కరాటే అకాడమి విద్యార్థులు ఎండీ తైబా, కొండ అశ్విన్‌బాబు, బండారి మణికంఠ, వర్షిత్ అనిశ్వర్, అక్షయ్ కీర్తన్, అట్టె రాఘవ, రక్షిత్‌రాణాలు కూమిత్‌లో తమ ప్రతిభనుచాటి గోల్డ్, సిల్వర్ పథకాలను సాధించినట్లు కోచ్ కావిటే సమ్మయ్య సోమవారం తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను జపాన్ షిటోరియో కరాటే రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య, ఇప్ప శ్రీనివాస్, రాజిరెడ్డి, మాడ సంపత్, హాసినిలు అభినందించారు.

నాస్తిక సంఘంపై దాడిని ఖండించాలి

మంథని, జనవరి 8: భారత నాస్తిక సంఘం ఆధ్వర్యంలో బీమాకోరేగాం స్ఫూర్తి దినోత్సవాన్ని ఏటూరునాగారంలోని ఒక ఫంక్షన్ హాలులో జరుపుకుంటున్న వాళ్లపై బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదులు చేసిన దాడిని ప్రజలు, ప్రజాస్వామిక వాదులందరు ఖండించాలని మావోయిస్టు పార్టీ ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి సబిత పిలుపునిచ్చారు. ఈ మేరకు సబిత పేరిట సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆ కార్యక్రమానికి బైరి నరేష్ ముఖ్యఅతిథిగా హాజరైన విషయం తెలుసుకున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు పూజారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులను పంపించి ఆ కార్యక్రమం జరగకుండా అడ్డుకోడానికి వాగ్వాదానికి దిగారన్నారు. అయినప్పటికీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పడంతో పోలీసులు జోక్యం చేసుకుని కార్యక్రమాన్ని బందు పెట్టుకున్నారన్నారు. అతను తిరిగి వెళ్లిపోతున్నప్పటికి అతనిపై దాడి చేశారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా దాడికి గురైన వారిపై కేసులు నమోదు చేశారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో దాడికి ప్రధాన కారకుడైన పూజారి రాధాకృష్ణతో పాటు అతని అనుచరులపై వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి. నాస్తికవాదులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. దళితులపై, ఆదివాసులపై, మతమైనార్టీలపై దాడికి కారణమైన ఆర్ఎస్ఎస్, బీజేపీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. భారతదేశంలో అందరూ హిందువులుగానే ఉండాలనే కుట్రలో భాగంగానే బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ సంస్థలు కుట్రలతో దాడులకు పాల్పడుతున్నారని దీన్ని ఖండించాలన్నారు.

రామగుండంలో అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు

అనుమతి లేకుండా ఒక్క హోర్డింగ్ ఉండొద్దు - పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా జరగాలి - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కోల్‌సిటీ, జనవరి 8: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అనుమతి లేని కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక దశలోనే తొలగించాలన్నారు. రోడ్డు ఆక్రమణలను సహించేది లేదని, ఎక్కడా రోడ్డు ఆక్రమణలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్షించారు. మూడు నెలల క్రితం తాను జరిపిన సమీక్షలో విభాగాల వారీగా లక్ష్యాలను నిర్దేశించానని, అవి ఎంతవరకు పూర్తి చేశారో చెప్పాలన్నారు. కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తీరు మార్చుకోవాలన్నారు. అనుమతి లేని కట్టడాలపై ఎక్కడా చర్యలు తీసుకోవడం లేదని, కనీసం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు కూడా సిఫార్సు చేయడం లేదన్నారు. ఇంత వరకు చర్యల నిమిత్తం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు ఒక సిఫార్సు కూడా రాలేదంటే టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరు అర్థమవుతుందన్నారు. ఎక్కడా అనుమతిలేని నిర్మాణాలు జరుగవద్దని, బేస్‌మెంట్లు, పిల్లర్ల స్థాయిలోనే తొలగించాలన్నారు. కార్పొరేషన్‌లో రోడ్ల ఆక్రమణలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, ఆక్రమణల తొలగింపు చర్యలపై ప్రచారం నిర్వహించాలన్నారు. కార్పొరేషన్‌లో వందల సంఖ్యలో ఎక్కడ పడితే అక్కడ హోర్డింగ్‌లు కనబడుతున్నాయని, వీటిలో చాలా వరకు అనుమతి లేనివి ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వాలని, రెవెన్యూ విభాగం ఫీజులు వసూలు చేయాలన్నారు. పారిశుధ్య విభాగం కార్పొరేషన్‌లో కీలకమైందని, కార్పొరేషన్ డంప్ యార్డుకు ఫెన్సింగ్ వేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగాలని, కార్పొరేషన్‌లోని వాహనాలను పూర్తి స్థాయిలో పూర్తి పని గంటలు వినియోగించాలన్నారు. వాణిజ్య ప్రదేశాలు, కల్యాణ మండపాలు, షాదీఖానాలను ఎంపిక చేసుకుని చెత్త నిర్వహణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నగరంలో బయట చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్పొరేషన్‌లో ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆస్తి పన్ను, నల్లాల బిల్లుల వసూళ్ల వందశాతం చేయాలన్నారు. కార్పొరేషన్ మార్కెట్లు, కాంప్లెక్స్‌ల నుంచి అద్దెలను పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలన్నారు. కార్పొరేషన్ పని తీరుపై కమిషనర్ ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశం జరుపాలని, తాను తుదుపరి నిర్వహించే సమావేశంలో రోడ్డు ఆక్రమణలు, ఆస్తి పన్ను, హోర్డింగ్‌లపై వచ్చే ఆదాయం, నీటి పన్ను, చెత్త నిర్వహణపై సంపూర్ణ నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ నాగేశ్వర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రాముల వారి అక్షింతలతో ఊరేగింపు



మియాపూర్‌లో రాములవారి అక్షింతలతో ర్యాలీ



పొత్కపల్లిలో అక్షింతలను అందజేస్తున్న రామభక్తులు

సుల్తానాబాద్, జనవరి 8: అయోధ్య రామమందిరం నుంచి తీసుకువచ్చిన రాముల వారి అక్షింతలతో మియాపూర్ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం గ్రామస్తులు అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటింటికీ వీటిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ స్వప్న అరుణ్, ఎంపీటీసీ ఫకీర్ యాదవ్, మాజీ సర్పంచ్ కార్తీక్, పోచం, సొసైటీ వైస్‌చైర్మన్ రాజు, లింగయ్య, శ్రీకాంత్, కందుల శ్రీనివాస్, స్వరూప వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, జనవరి 8 : మండలంలోని పొత్కపల్లిలో సోమవారం గడపగడపకు అయోధ్య రాములోరి అక్షింతలను అందజేశారు. ఈనెల 22న, చారిత్రాత్మక అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం రోజున అక్షింతలను పెద్దలకు అందజేసి వారితో ఆశీర్వాదం పొందాలని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లూరి పృథ్వీరాజ్, సిరిసేటి రాహుల్, శంకర్, ఆళ్ల తిరుపతిరెడ్డి, నిఖిల్, ఉభయరెడ్డి, రామకృష్ణ, శనిగరపు రవీందర్, భూషణ వేణి సత్యం, సిరిసేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 8 : మండలంలోని నిట్టూరు గ్రామంలో సోమవారం గడపగడపకు అయోధ్య రాములోరి అక్షింతలను డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపు చేసి పంపిణీ చేశారు. ఈనెల 22న చారిత్రాత్మక అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా రాముల వారి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గిరినేని సంపత్‌రావు, అర్చకులు కొండపాక వెంకటచార్యులు, మందల సురేందర్, మందల రాజు, కుంభాల సుధాకర్, పోతని శ్రీను, జనార్దన్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంతర్గాం, జనవరి 8: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లిలో సోమవారం భక్తులు అయోధ్య శ్రీరాముడి శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. అయోధ్య శ్రీరామ ట్రస్ట్ ద్వారా స్వామివారి అక్షింతలు గ్రామానికి చేరుకోగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అక్షింతలను స్వీకరించారు. స్వామివారి శోభయాత్రకు మహిళలు మంగళహారతులు, కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. కుందనపల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ప్రతినిధులు ఈనెల 22న అయోధ్యలో జరుగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ వివరాలను, గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీ కాంట్రాక్టర్ కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, జక్కుల నారాయణ, బండిపల్లి చంద్రయ్య, సుంకరి రవి, సంగవేణి శేఖర్, ఆలయ పూజారి కొండపాక సత్యనారాయణచారి పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 8: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను సోమవారం మండలంలోని దొంగతుర్తి, నాయకంపల్లి గ్రామాల్లో ఇంటింటికి పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి వేడుకల ప్రారంభ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అందించిన శ్రీరాముడి అక్షింతలు శ్రీరామ చిత్రపటంను భక్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆయా గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నిట్టూరులో అక్షింతలను ఊరేగింపు



ఆర్జీ-2లో ఘనంగా క్రీడా వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8: ఆర్జీ-2 ఏరియా 31వ వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 31వ వార్షికోత్సవం సోమవారం సీఈఆర్ క్లబ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా జీఎం సూర్యనారాయణ హాజరై వార్షిక క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులక బహుమతులను అందజేశారు. ప్రతి ఉద్యోగి ఏదైనా క్రీడలో నైపుణ్యత సాధించేలా సాధన చేయాలని, యువ ఉద్యోగులు క్రీడల పట్ల మొగ్గు చూపేలా సీనియర్లు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన అఖిల్‌ను జీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుపీఎస్ సెక్రెటరీ వేణగోపాల్, గుర్తింపు సంఘం ఏరియా సెక్రెటరీ జిగురు రవీందర్, అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం బీ రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి, డీవైపీఎం వంశీధర్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీలకు సింగరేణి జట్టు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఎస్ఈసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి జరగనున్న కోల్ ఇండియా స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు సింగరేణి జట్టు సోమవారం బయలుదేరి వెళ్లింది. ఈ పోటీ ల్లో కోల్ ఇండియాలోని సంస్థలకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొననున్నాయి. టీం ఛాంపియన్, సింగిల్స్, డబుల్స్, వెటరన్ సిగిల్స్, వెటరన్ డబుల్స్ విభాగా ల్లో పోటీలు జరగనున్నాయి. కోల్ ఇండియాకు ఎంపికైన సింగరేణి లాన్ టెన్నిస్ జట్టు సభ్యులు కే చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగు శేఖర్, బెక్కం రవి, వెంక టేశ్వర్లు, సంజీవ్ యాదవ్, శ్రీమన్నారాయణ, శశిధర్‌రెడ్డి, తిరుమల్ ఉన్నారు. కోల్ ఇండియా పోటీలకు వెళ్లిన జట్టుకు ఆర్జీ-2 డబ్ల్యుపీఎస్ అధికారులు అభినందనలు తెలిపారు.

ఆర్కే5బీ కార్మికులకు వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 8: శ్రీరాంపూర్‌లోని ఆర్కే5బి సెక్షన్ కార్మికులకు వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఆర్కే5బి సెక్షన్ నుంచి ఉత్పత్తి నిలిపివేసిన అనంతరం కార్మికులు ఆర్కే5 షైన్‌కు బదిలీ అయ్యారని తెలిపారు. డ్యూటీలకు వచ్చే వారికి గదులు, లాకర్లు, నీటి సరఫరా, వాహనాల కోసం షెడ్లు నిర్మించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి మేనేజర్ శివయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పిన్నింటి మల్లారెడ్డి, అకుల రాజయ్య, రామిడి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన మైనింగ్ సర్దార్ చికిత్స పొందుతూ మృతి

- కార్మికులు, కార్మిక సంఘాల నాయకుల ధర్నా - వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



సీఎంఓపీ చాంబర్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు, కార్మిక నాయకులు

గోదావరిఖని, జనవరి 8: గని ప్రమాదంలో గాయపడిన మైనింగ్ సర్దార్ 16 రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ సీఎంవో చాంబర్‌లో కార్మిక సంఘాల నాయకులు, బంధువులు, కార్మికులు ఆందోళనకు దిగారు. మంచిర్యాల జిల్లా కాసిపేట 2ఇంక్లైన్‌లో పనిచేసే మచ్చ రమేష్(26) అనే మైనింగ్ సర్దార్ డిసెంబర్ 22న గనిలో ప్రమాదవశాత్తు కాలుకు దెబ్బ తగలి విరిగింది. మందమర్రి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఎక్స్‌రేకు తీసుకెళుతున్న సమయంలో అకస్మాత్తుగా మృతిచెందాడు. వైద్యులు సరైన చికిత్స చేయకపోవడం వల్లనే రమేష్ మృతిచెందాడని, బంధువులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. 16రోజులుగా ఎలాంటి వైద్య సేవలందించలేదని, ఏం వైద్య సేవలు అందించారో చెప్పాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదని, రమేష్‌కు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మృతిచెందాడని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, వైద్యుల నిర్లక్ష్యం వల్లనే రమేష్ అనే మైనింగ్ సర్దార్ మృతిచెందాడంటూ సీఎంవో కిరణ్‌రాజ్ చాంబర్‌లో ఆందోళనకు దిగారు. సీఐటీయూ నాయకుడు మెండె శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు పెండ్యాల మహేష్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులకు సరైన వైద్య సేవలు అందడం లేదని, ఆసుపత్రిలో రమేష్‌కు ఇచ్చిన మందుల వల్లనే అతను మృతిచెందాడని, ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను నియమించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఎల్1 మందులు వాడవద్దని చెప్పినా వాడుతున్నారని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పరిశీలించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే రమేష్ మృతిచెందాడని ఆయన ఆరోపించారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 8: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి వైద్య అధికారిణి డా.పద్మ సూచించారు. సోమవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఆరోగ్య సంరక్షణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ పద్మ మాట్లాడారు. కోవిడ్ బారిన పడకుండా గతంలో పాటించిన స్వీయ నియంత్రణ చర్యలను పాటించాలని సూచించారు. చేతులు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం, ఇల్లు, పని స్థలాలను శుభ్రంగా ఉంచడం ద్వారా కోవిడ్‌ను నియంత్రించవచ్చని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వేడి నీర తాగడం, ఆవిరి పట్టడం వాటిని పాటించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. లక్షణాలు కనిపిస్తే నిర్లక్షం చేయకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రమేష్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్, షిఫ్ట్ ఇంచార్జి రాజన్నతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలతో చెలగాటం..

- ఏరియా ఆసుపత్రిలో అందని ఎమర్జెన్సీ సేవలు



సెలైన్ పెట్టుకుని నడుచుకుంటూ వైద్యుడి వద్దకు వెళుతున్న రవీందర్

గోదావరిఖని, జనవరి 8: సింగరేణి సంస్థకు తమ రక్తాన్ని చెమటగా మార్చి సంస్థను లాభాల బాటలోకి తీసుకువస్తుంటే కనీసం వారికి వైద్య సేవలు అందించడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఆసుపత్రిలో కార్మికుడు వస్తే కనీసం వీల్‌చైర్, స్ట్రెచర్ తీసుకురాని దుస్థితిలో సిబ్బంది ఉన్నారు. ఆర్‌జీ-3 పీవో ఆఫీస్‌లో పనిచేసే కారుపాకుల రవీందర్ విధి నిర్వహణలో సోమవారం సొమ్మసిల్లి పడిపోగా తోటి కార్మికుడు అక్కడి నుంచి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అంబులెన్స్ నుంచి వీల్‌చైర్‌పైన లేదా స్ట్రెచర్ పైన కార్మికున్ని తీసుకురావాల్సి ఉండగా, సిబ్బంది ఒక్కరూ కూడా అందుబాటులో లేరు. తోటి కార్మికుడి సహాయంతో సెలైన్ బాటిల్‌తో వైద్యుల వద్దకు రవీందర్ నడుచుకుంటూ వచ్చాడు.

సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ఇటీవల అకస్మాత్తుగా పలు సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెచ్చరించినప్పటికీ వైద్యులు, వైద్య సిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. రోగే నడు చుకుంటూ రావడం ఆసుపత్రిలో పలువురిని కలిచివేసింది.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

రామగిరి, జనవరి 8: రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన అరెల్లి పోచం అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం రాంచందర్‌రావు, తొగరి చంద్రయ్య, అద్దూరి శ్రీకాంత్, ప్రవీణ్, రాజేందర్, శేకర్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మంథని, జనవరి 8: మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నాగెల్లి సమ్మక్క వర్ధంతి సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మపరివార్ అనాథ, వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం చేసినట్లు కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్య నిపుణురాలికి సత్కారం

రామగిరి, జనవరి 8: రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన ప్రకృతి వైద్య నిపుణురాలు శరణ్య సావిత్రిబాయిఫూలే అవార్డు పొందిన సందర్భంగా సోమవారం స్థానిక సర్పంచ్ గంటపద్మ శాలువతో ఘనంగా సత్కారించారు. హైదరాబాద్‌లోని రవీంద్రబారతిలో ఈ నెల 3న బీసీసంక్షేమ సంఘం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో స్థానికంగా విశేష సేవాలు అందించిన శరణ్యకు సావిత్రిబాయిఫూలే అవార్డును అందజేయడం పట్ల స్థానిక సర్పంచ్ అభినందిస్తూ సన్మానించి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డిలు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన సింగిల్‌విండో చైర్మన్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 8: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సందర్శించగా సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రంరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం సొసైటీ సంఘ వివరాలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు కొత్తూరు మొండయ్య, కేతిపల్లి నరసింహారెడ్డి, సీఈఓ కొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాల మహానాడు గ్రామ కమిటీ నియామకం

జూలపల్లి, జనవరి 8: జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామానికి చెందిన మాల కులసంఘం నాయకులు సోమవారం సమావేశమై నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా నియామకం చేశారు. అధ్యక్షుడిగా మొగురం నరేష్, ఉపాధ్యక్షులుగా పాక ప్రభాకర్, మొగురం చందు, మొగురం మహేష్, బీమయ్య, వెంకటి, కిరన్, గట్టయ్యను ఎన్నుకున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, జనవరి8: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై మండలంలోని 32మంది లబ్దిదారులకు రూ.32.03లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెళ్లి అయిన ఆడబిడ్డకు త్వరలోనే పసుపు కుంకుమ కార్యక్రమం ద్వారా రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని అన్నారు. అనంతరం మొదటిసారిగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను తహసీల్దార్ జాహెద్‌పాషా సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకుందని నూతన భవనం మంజూరు చేయాలని తహసీల్దార్ జాహెద్‌పాషా ఎమ్మెల్యేను కోరగా భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, తహసిల్దార్ జాహెద్‌పాషా, డిప్యూటీ తహసిల్దార్ ధీరజ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దపల్లి రూరల్, జనవరి8: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన జిల్లెల్ల బూధమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో రూ.8వేల ఆర్థికసాయంతో పాటు 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ సాదుల వెంకటేశ్వర్లు, సెక్రటరీ వేల్పుల రమేష్, కోశాధికారి రాంచంద్రారెడ్డి, బెల్లంకొండ జయపాల్‌రెడ్డి, మీసాల సత్యనారాయణ, ముత్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే తనయుడి ఆర్థిక సహాయం

ఓదెల, జనవరి 8: ఓదెల మండలం కొమిరకు చెందిన నాగపురి శ్రీనివాస్ గౌడ్‌కు సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీకృష్ణ పంపించిన రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వివేక్ కుమారుడు కృష్ణవంశీకి శ్రీనివాస్ పరిస్థితి తెలపడంతో స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.ఐదు వేలు ఇవ్వడంతో శ్రీనివాస్ కుటుంబానికి అందజేసినట్లు కాంగ్రెస్ నాయకుడు అల్లం సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లం సతీష్ తో పాటు పంజాల రాజు, స్వామి, సూత్రాల సునీల్, సతీష్, బొడ్డుపల్లి సిద్దు,మణికంఠ రాపర్తి రామేష్, సాగర్, నాగపురి రమేష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ముత్తారం, జనవరి 8: మండలంలోని కేశనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం భూమయ్య తల్లి ఇటీవల మరణించగా సోమవారం మృతురాలి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, ముత్తారం మండల మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పెగడ కుమార్, వైద్య రాజేందర్, చుంచు లింగయ్య, చిందం సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల వితరణ

పెద్దపల్లి రూరల్, జనవరి 8: మండలంలోని పెద్దబొంకూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు సోమవారం గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ తన తండ్రి మిట్టపల్లి శంకరయ్య స్మారకార్థం కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాస్, కలవేన రాజేందర్, రవి, కల్వల తిరుపతిగౌడ్, తగరం అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సన్మానం

కమాన్‌పూర్/ముత్తారం, జనవరి8: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎన్నికల్లో భారీ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలను స్వీకరించినందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దెల రాజయ్య వేములవాడలో మొక్కులు చెల్లించుకునేందుకు పాదయాత్రగా వెళ్తుండగా సోమవారం రామగిరి మండల కేంద్రంలో కమాన్‌పూర్ మండల శాఖ తరఫున నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజయ్యను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వైనాల రాజు సత్కరించారు. సోమవారం ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్యను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తారం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, ముత్తారం మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ సత్కరించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు..

పెద్దపల్లి రూరల్, జనవరి 8 : తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ప్రజా పాలన దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నమోదు కొనసాగుతోంది. పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్‌లు నమోదు ప్రక్రియలో బిజీబిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీవో సుదర్శన్ నమోదును పరిశీలించారు.